క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అప్పాజీ

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ గొంపం గ్రామంలో జన్‌జీవన్ సంఘం అధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.అప్పాజీ మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యక్షుడు పి.మహేష్‌బాబు మాట్లాడుతూ పోలీసుల అక్రమ అరెస్టులను ప్రశ్నించాలని, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన చెప్పారు. సంఘ కార్యదర్శి జి.సురేష్ మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు దుర్వినియోగం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తుల సమస్యలను వివరించారు.

గ్రామంలో కుక్కల స్వైరవిహారం



అరుకు రోడ్డులో సంచరిస్తున్న కుక్కలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకుసంత గ్రామం రోడ్డులో శునకాల స్వైరవిహారంతో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై గుంపులుగా శునకాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వాహనచోదకులు, పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనచోదకుల కుక్కలు వెంటపడడంతో వాహనాలు అదుపుతప్పడంతో గాయాల బారిన పడుతున్నారని పలువురు చెబుతున్నారు. చీకటి పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, బయటకొచ్చేందుకు భయపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికై నా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మర్రిగూడెంలో బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న నాయకులు

కూనవరం: మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకట రామారావు ఇటీవల విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం రూ.15వేల ఆర్థికసాయమందించి ఔదార్యం చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ముందు ఉంటుందని నాయకులు చెప్పారు. రాష్ట్ర నాయకులు ఆవుల మరియాదాస్, దీకొండ గంగాధర్, కొమ్మాని మోహన్‌రావు, చిలకం హరనాథ్, కొమ్మాని సునీత, చిచ్చడి మంజుల, పరిటాల పద్మావతి, వెంకటేశ్వర్లు, నాగరాజు, బత్తుల వెంకటేశ్వర్లు, వెంకటాద్రి, నవీన్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వారపు సంత



జనాలతో కిటకిటలాడిన వారపుసంత

పెదబయలు: మండల కేంద్రంలోని వారపు సంత సోమవారం జనాలతో కిటకిటలాడింది. గత నెల రోజుల నుంచి భారీ వర్షాల కారణంగా గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో మండల కేంద్రానికి శివారు గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. అయితే రెండు రోజుల నుంచి వాతావరణం బాగుండడంతో సోమవారం సంతకు జనాలు వచ్చి తమకు కావాలసిన వస్తువులు కొనుగోలు చేశారు. గత రెండు వారాల నుంచి పెదబయలు సంత వెలవెలబోయింది. సంతకు ఒక్కసారిగా జనాలు రావడంతో సీజన్‌ను తలపించింది. కూరగాయలు, దుస్తులు, ఇతర వ్యాపారాలు బాగా జరిగినట్టు సంత చిరువ్యాపారులు తెలిపారు.

అతిథులకు ఆతిథ్యం కరువు

- నిరుపయోగంగా అతిథి గృహాలు
- శిథిలావస్థలో భవనాలు
- అధికారులు, ప్రజాప్రతినిధులకు వేధిస్తున్న వసతి సమస్య



ప్రారంభానికి నోచుకోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం



శిథిలావస్థలో ఐటీడీఏ అతిథి గృహం

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులకు వసతి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ కేంద్రాల్లో జిల్లా స్థాయి అధికారుల నుంచి రాష్ట్రస్థాయి అధికారులతో పాటు ఉన్నతస్థాయి ప్రజా ప్రతినిధులు సందర్శనకు వస్తూ ఉంటారు. ప్రస్తుతం వారికి ఎటువంటి వసతి సౌకర్యం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చింతపల్లి మండల కేంద్రంలో ఐటీడీఏ పీవో అతిథి గృహం, జిల్లా పరిషత్, రోడ్డు భవనాల శాఖ, రాష్ట్ర కాఫీ అటవీ అభివృద్ధి, అటవీ శాఖ అతిథి గృహాలు అధికారులకు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఇవన్నీ మూలకు చేరడంతో ఈ ప్రాంతానికి వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏదో ఒకచోట తల దాచుకునే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఉన్నటువంటి ఐటీడీఏ పీవో అతిథి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దాని మరమ్మత్తులు చేపట్టే విధంగా ఒక్క అధికారులు చర్యలు చేపట్టలేదు. స్థానికంగా ఉన్నటువంటి జిల్లా పరిషత్ అతిథి గృహానికి దశల వారీగా సుమారు రూ.75 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేసిన దానిని వినియోగంలోనికి తీసుకురావడంలో అధికారులు విఫలం కావడంతో అవి నేటికీ వినియోగంగానే పడి ఉన్నాయి. అదే విధంగా రోడ్లు భవనాలకు సంబంధించినటువంటి అతిథి గృహాన్ని కోటి రూపాయలతో అధునాత భవనాన్ని నిర్మించినప్పటికీ గత ఐదు సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోలేదు. ఎంతో మందికి అతిథ్యం ఇచ్చిన రాష్ట్ర కాఫీ అభివృద్ధి శాఖ అతిథి గృహాన్ని ఆ శాఖ రీజనల్ మేనేజర్ కార్యాలయంగా మార్చడంతో ఆ అతిథి గృహంలో ఆదిత్యం కరువైంది. అటవీ శాఖ సంబంధించిన అతిథి గృహం కూడా పూర్తిగా తొలగించంతో చింతపల్లి మండల కేంద్రంలో పర్యటించే అధికార, అనధికార, ప్రజాప్రతినిధులకు ఒక్క పూట ఉండడానికి నిలువనీడ లేకుండా పోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి సంబంధించిన వారి ఇళ్లల్లో గడపాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. ఇప్పటికైనా సంభందిత ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహాలను అందుబాటులో తీసుకురావల్సిన అవసం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న రోడ్డు భవనాల శాఖ అతిథి గృహాలను వినియోగంలో తీసుకురావడానికి అధికారలు చర్యలు చేపట్టాలి. మండల కేంద్రంలో ప్రభుత్వం అతిథి గృహాలు లేక అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించిఅతిథి గృహాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– దురియా పుష్పలత, సర్పంచ్, చింతపల్లి

ప్రతిపాదనలు పంపాం



చింతపల్లిలో నిరుపయోగంగా ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని అందుబాటులో తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నాం. తక్షణమే అతిథి గృహంలో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్ వంటివి పూర్తిస్థాయిలో సౌకర్యలు కల్పించడానికి అధికారులకు ప్రతిపాదనలు చేశాం. ఈ అతిథి గృహాన్ని వినియోగంలో తీసుకురావడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం.

– ఆశాజ్యోతి ఎంపీడీవో, చింతపల్లి

వసతి గృహంలో బోరు ఏర్పాటు



బోరును ప్రారంభిస్తున్న దాతలు

ఎటపాక: మండల కేంద్రంలోని ఏయూపీఎస్ బాలికల వసతి గృహంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బోరు ఏర్పాటు చేశారు. ఇక్కడ నీటి ఇబ్బందులున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడంతో అధికారులు సమారిటన్ ఫర్ ద నేషన్ సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సంస్థ రూ1.50లక్షల వ్యయంతో బోరును ఏర్పాటు చేసి నీటి సౌకర్యాన్ని కల్పించారు. సంస్థ అధినేత రామ్‌కుమార్, సీఆర్పీఎఫ్ బెటాలియన్ పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లను కొనసాగించాలి

డుంబ్రిగుడ: రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల మంది గ్రామ వలంటీర్లు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని వారికి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేయడం బాధిస్తోందన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు వలంటీర్ల కొనసాగింపు విషయంపై రూ.10వేలు అందించి, ఉద్యోగ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారు. అన్నమాట ప్రకారం మాట నిలబెట్టుకొని వారికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాజకీయ ఒత్తిడికిలోనై రాజీనామా చేసిన వారిని తిరిగి కొనసాగించాలని కోరారు. ఇటీవల పంచాయితీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నేత రాజేంద్ర ప్రసాద్ గ్రామ వలంటీర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాలియా తోటలో కలుపుతీత



దాలియా తోటలో కలుపుతీత పనుల్లో గిరిజనులు



నారింజవలసలో దాలియా తోట

డుంబ్రిగుడ: ప్రకృతి ప్రేమికులతో పాటు, పర్యాటకులకు ఆహ్లాద వాతావరణంలో దాలియా పువ్వుల అందాలు కట్టిపడేస్తాయి. ఆక్టోబర్ నుంచి జనవరి వరకు మన్యంలోని దాలియా పూలు విరగ్గాస్తాయి. ఎంతో ఆకర్షణగా ఉండే దాలియా పువ్వులు, వలిసె పూల అందాలు భూమికి పచ్చని రంగేసినట్టే ఆకర్షణగా ఉంటుంది. ప్రస్తుతం దాలియా తోటల్లో పువ్వులు గుబురుగా పెరిగి దిగుబడి బాగా వచ్చేందుకు గిరిజనులు కలుపు మొక్కలను తొలగించే పనులు చేస్తున్నారు.

కాజ్‌వేకు మరమ్మతు చేయాలి



కాజ్‌వే కింద కొట్టుకుపోయిన మట్టిని చూపిస్తున్న మాజీ జెడ్పీటీసీ చిన్నాలమ్మ

రాజవొమ్మంగి: మండలంలోని ఉర్లాకులపాడు నుంచి జి.శరభవం వెళ్లే మార్గంలో కొండవాగుపై గల కాజ్‌వేకు వెంటనే మరమ్మతు చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కోసూరి బుజ్జి చిన్నాలమ్మ కోరారు. ఇటీవల వర్షాలకు వాగు పొంగి కాజ్‌వే కింద ఉన్న మట్టి కొట్టుకొని పోయిందని, పునాదులు కూడా చాలా వరకు దెబ్బతిన్నాయన్నారు. ఓ వైపు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా వేరే మార్గం లేక ఈ కల్వర్ట్ పైనుంచే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. ఈ కల్వర్టు కూలిపోతే లోతట్టున గల మూడు పీవీటీజీ గ్రామాలకు రాకపోకలు నిలచిపోతాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఆమెతోపాటు గ్రామస్తులు కాసులమ్మ, మల్లిరెడ్డి, వీరబాబు, చంటిబాబు తదితరులున్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



అడపవలస-ఛటువా మధ్య రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు



పాడైన రోడ్డును చూపుతున్న గొప్పలవలస గ్రామస్తులు



పెద్దగడ సమీపంలో కొమ్మంగిలో వంతెనపై కొట్టుకు వచ్చిన బురద

డుంబ్రిగుడ: గత ప్రభుత్వం హయంలో నిర్మాణం చేపట్టిన సొవ్వా తారురోడ్డులో ప్రస్తుతం గసభ పంచాయతీరోడ్డు పనులు అవుతండటంతో భారీ వాహనాలు తిరుగుతుండటంతో నూతన రోడ్డు పూర్తిగా సగానికి సగం ధ్వంసమైనట్టు సొవ్వ మాజీ సర్పంచ్ రాంప్రసాద్, గ్రామస్తులు సోమవారం సంబంధిత రోడ్డు నిర్మాణ కంట్రాక్టర్‌ను లారీ ఆపి రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. భారీ వాహనాలతో పూర్తిగా పాడైపోయింది. ఈసందర్భంగా రోడ్డు పర్యవేక్షణ చేసే జెఈ పట్టించుకోకపోవడంతో ఈరోడ్డు మునాళ్ళ ముచ్చటగా మారుతుందన్నారు. ఉన్నతా. ధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

డుంబ్రిగుడ: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు జైపూర్ జంక్షన్ నుంచి అడపవలస మీదుగా ఒడిశా ప్రాంతం చటువా ప్రాంతానికి వెళ్లే రహదారిలో అడపవలస రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనచోదులు చెబుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియర్‌తో పాటు రహదారిలో సిగ్నల్ ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

చింతపల్లి: మండలంలో కొమ్మంగి పంచాయతీ కేంద్రానికి వెళ్లె రహదారిలో నిర్మించిన లోలెవల్ వంతెన మీదకు డ్రైనేజీ సౌకర్యం లేక మట్టి కొట్టుకువచ్చింది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది. పెద్దబడడం పంచాయతీ పెద్దగడ్డ మెయిన్ రోడ్డు నుంచి కొమ్మంగి పంచాయతీ కేంద్రానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నూతనంగా తారు రోడ్డు నిర్మించారు. పెద్దగడ్డ నుంచి కొమ్మంగి వరకు సుమారు 5 కిలోమీటర్లు రహదారి నిర్మాణాన్ని నూతనంగా చేపట్టినప్పటికి ఈ మార్గంలో కాలువలేక చిన్న వర్షం పడినా కొండ ప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీరు , మట్టి బురద రెండు వంతెనపై కొట్టుకువస్తోందని, వాహనచోదకులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి

కొయ్యూరు: మండలంలోని మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి మాట్లాడుతూ ఓజన్ పొర క్షీణించడం వల్ల మానవ మనుగడపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తుందన్నారు. ఓజన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. రసాయన, గణితశాస్త్ర, బోటనీ, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం.శ్రీవిద్య, మంగమ్మ, కుమారి, డాక్టర్ రాజుబాబు మాట్లాడుతూ ఏపీ, రిఫ్రిజిరేటర్ల వినియోగం వల్ల కర్బన ఉద్గారాలు వెలువడడంతో ఓజోన్ పొర దెబ్బతింటుందని, ఓజన్ పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. అధ్యాపకులు రమణ, శ్రీనివాస్, పుష్ప, శేఖర్, భువన, సౌమిత్రి, సీత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పించాలి

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ లకేపుట్టు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో తమకు ఉపాధి కల్పించాలని లకేపుట్టు ఎనిమిది కుటుంబాల పీవీటీజీ గిరిజనులు కోరారు. గత దశాబ్ద కాలంలో పాఠశాల ప్రదేశంలో సాగు చేస్తున్నామని, అయితే ఈ స్థలంలో ప్రసుత్తం పాఠశాల నిర్మిస్తుండగా, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా 8 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే పాఠశాల నిర్మాణం జరుగుతున్నా తమకు ఉపాధి కల్పించడం లేదన్నారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్, కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లామని, తమకు న్యాయం చేయాలని, తాము సాగు భూమిని కోల్పోయామన్నారు. ప్రభుత్వం, అధికారులు తమకు జీవనోపాధి కల్పించాలని బాధిత కుటుంబ సభ్యులు రాజారావు, మొస్యన్న, మందన్న, సత్తిబాబు, రవికుమార్, రమేష్, బుడ్డీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్యాన మహాయాగం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం- అందలాపల్లి భగీరథ ఆలయం పక్కన మంగళవారం నుంచి ధ్యాన మహాయాగం నిర్వహించనున్నట్టు శ్రీగిజా పిరమిడ్ వ్యవస్థాపకుడు లీలా ప్రసన్నకుమార్, శివ గణేశ్వరరావు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సంగీత ధ్యాన్యంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 19న డాక్టర్ మాధవరావు మహిళల గైనిక్ వ్యాధులపై అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఈ క్రాప్ నమోదు గడువు పెంపు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ–క్రాప్ నమోదు గడువును ఈ నెల 25 వ తేదీ వరకు పొడిగించినట్టు మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత ఈ నెల 15 వ తేదీ వరకు గడువు విధించగా, రాష్ట్రంలో వరదల కారణంగా గడువును మరో 10 రోజులు పొడిగించారన్నారు. ఈ–క్రాప్ నమోదు చేస్తేనే పంటల బీమా అమలు అవుతుందని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన అవసరం

మాకవరపాలెం: హెచ్ఐవీపై నివారణకు అందరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ డి.రమణ సూచించారు. మండలంలోని ఎం.నగరం, బయ్యవరం గ్రామాల్లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజలకు వివరించారు. అలాగే సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరా, వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు



రచ్చపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న గ్రామస్తుడు బాలు

జి.మాడుగుల: చింతపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో రచ్చపల్లి గ్రామం వద్ద సోమవారం ఆటో, బైక్ ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన గాయాలతో ఉన్నవారిని కులపాడుకు చెందిన బాలు, స్థానికులు స్పందించి ప్రైవేట్ వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రమాద సంఘటనపై వివరాలు తెలియాల్సింది. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా తమ ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

రేంజర్‌కు ఫిర్యాదు



రేంజర్‌కు ఫిర్యాదు పత్రాన్ని ఇస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: మండలంలో ఎక్కడ చూసినా బహుళ అంతస్తు భవనాలు పెరిగి పోయాయని, వీటి నిర్మాణంలో ఉపయోగిస్తున్న టేకు వంటి విలువైన కలప ఎక్కడి నుంచి వస్తోందో నిగ్గు తేల్చాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు తమకు వెంటనే పూర్తి సమాచారం ఇవ్వాలంటూ నాయకులు సోమవారం స్థానిక అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొరకు లేఖ అందజేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా మండలకేంద్రం రాజవొమ్మంగిలో భారీ కట్టడాలు పెరిగిపోయాయని, వాటితో పాటు గుమ్మాలు, కిటికీలు, తలుపులు, ఫర్నీచర్ తయారీ కోసం రక్షిత అటవీ ప్రాంతం నుంచి విలువైన కలప మాయమవుతోందని ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ విధంగా తరలిపోతున్న అక్రమ కలపపై ఇప్పటి వరకు ఎంత అపరాధ రుసుము వసూలు చేశారు తదితర సమాచారం ఇవ్వాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. బాలకృష్ణ, నాగరాజు తదితరులున్నారు.

అధ్వానంగా వారపు సంత

- వారపు సంత మధ్యలో మురుగునీటి గుంత
- వర్షాల వల్ల పేరుకుపోయిన చెత్త
- తీవ్ర దుర్గందంతో అవస్థలు



వారపు సంత దుకాణాల వద్ద మురుగునీరు గుంత

పెదబయలు: మండల కేంద్రంలోని వారపు సంత మధ్యలో ఉన్న గోతులో చెత్త పేరుకుపోయి ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుళ్లిన చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో వ్యాపారులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. మురుగు గుంతపక్కనే దుకాణాలు పెట్టుకుని అమ్మకం చేసిన చిరు వ్యాపారులు రోజంతా దుర్వాసనలో ముక్కు మూసుకుని ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్ర దుర్గంధంతో ఈగలు, దోమలు పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఆశీలు వసూళ్ల చేస్తున్నా సంతలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికై న గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురుగు గుంతను మట్టితో పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.అధికారులు స్పందించాల్సి ఉంది.లేకుంటే మరింతగా దోమలు వృద్ధి చెందె అవకాశం ఉందని అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



జోలాపుట్టులో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నీలకంఠం

ముంచంగిపుట్టు:మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో సోమవారం సర్పంచ్ నీలకంఠం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా చెత్త తొలగింపు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేయించారు. బ్లీచింగ్ జల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ ప్రజలంతా పరిశుభ్రత, పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉంటామన్నారు. చెత్త తొలగింపులో ప్రత్యేక చొరవ తీసుకున్న సర్పంచ్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు.